# నాన్నలెందుకు లేరు?

సాయంత్రం స్కూల్ వదిలిపెట్టగానే నేను వేగంగా నడుచుకుంటూ మా గుడిసెకు రాసాగాను. దారిలో రోజూ చూసే డాబాలు రకరకాలుగా ఉన్నాయి. ఆ డాబాలన్నిటినీ దాటుకుంటూ పట్నం చివరకు వెళితే గుడిసెలు వరుసగా ఉంటాయి. వాటిలోని ఒక గుడిసె మాది. నేను గుడిసెకి వెళ్ళే సరికి అమ్మ తలనిండా పూలు, ముఖానికి బొట్టు పెట్టుకొని, పౌడరు రాసుకుని గుడిసెముందు కూర్చుని ఉంది.

నన్ను చూడగానే ఆనందంగా "బాబూ! స్కూల్ వదిలారా? స్నానం చేసి చదువుకో" అంది.

"అలాగే" అని స్నానం చేయసాగాను. రాత్రి అవుతుందంటే చాలు మా పేటలోని వాళ్ళందరూ ఎవరి గుడిసెల ముందు వారు శుభ్రంగా స్నానాలు చేసి కూర్చుంటారు. ప్రతి రోజూ చాలామంది నాన్నలు మా పేటకు వస్తారు. వారిని మా పేటలోని ఆడవాళ్ళందరూ "ఓయ్!... ఇలారా!" అంటూ పిలుస్తుంటారు. వారు, కొంతమందిని చీదరించుకుంటారు. మరికొంతమంది దగ్గరకి ప్రేమగా వెళ్తుంటారు.

మా అమ్మకూడా రోజూ ఇలాగే నాన్నలను పిలుస్తుంటుంది. అమ్మ పిలిచిన ఏ నాన్నయినా చీదరించుకోకుండా, అమ్మ పిలిచిన వెంటనే గుడిసెలోకి వస్తాడు. అప్పుడు అమ్మ నన్ను గుడిసె బయట ఉండమంటుంది. ఆ నాన్న అరగంట, గంట గుడిసెలో ఉండి బయటకు వస్తాడు. అమ్మ ముఖం అప్పుడు చూస్తే చిందర వందరగా ఉంటుంది. అసలు అమ్మ బావుండదు. మళ్ళీ అద్దం ముందు కాసేపు కూర్చుంటుంది. తరువాత గుడిసె ముందు కూర్చుని మరొక నాన్నకోసం ఎదురు చూస్తుంది. ఆ నాన్నవస్తే మొదట చేసినట్టే చేస్తుంది.

నేను ఒకసారి అమ్మను "నాన్నలెందుకు వస్తారమ్మా?" అనడిగాను.

నా ప్రశ్నకు అమ్మకలవరపడి "మన దగ్గర డబ్బులు లేవుకదా! నాన్నల దగ్గర డబ్బులు ఉంటాయి. అవి మనకు ఇవ్వటానికి వస్తారు." అని చెప్పింది. అమ్మ చెప్పింది నాకేమీ అర్థంకాలేదు.

ఒకొక్కరోజు రాత్రి అమ్మ దగ్గరకు నాన్నలు చాలామంది వరుసగా వస్తారు. ఆ రోజు అమ్మ నీరసంగా ఉంటుంది. అయినా హుషారుగా ఉంటుంది. ఆ రోజే నాకు అడిగినన్ని డబ్బులు ఇచ్చి, నా ఇష్టమొచ్చినవి కొనుక్కోమంటుంది. తొమ్మిది గంటల సినిమాకి వెళ్ళిరమ్మంటుంది. నాకారోజు సంతోషంగా ఉంటుంది. అమ్మ ఇచ్చిన డబ్బులతో మిఠాయి, జిలేబీ.. ఒకటనేముంది నాకు ఏది తినాలనుంటుందో దాన్ని తింటాను. సినిమాకెళ్ళినప్పుడు సినిమాలో ఉండే వారందరూ బావుంటారు. దానిలో ఉండే నాలాంటి పిల్లలకు నాన్నలు ఉండరు. ఒక నాన్న మాత్రమే ఉంటాడు. మరి నాకేమో చాలామంది నాన్నలు ఉన్నారు. సినిమాలో నాన్న, సినిమా చివరి వరకు ఆయనే ఉంటాడు. అమ్మ దగ్గరకు వచ్చే నాన్నలు ఒకసారి కనిపిస్తే, మరోసారి కనిపించరు. ఎప్పటికప్పుడు కొత్తనాన్నలు వస్తూనే ఉంటారు. సినిమా వదిలి పెట్టిన తరువాత గుడిసెకు వెళ్తే అమ్మ ఇంకా నాన్నలతోనే ఉంటుంది. గుడిసె ముందు ఉన్న కుక్కి మంచంలో నేను నిద్రపోతాను. అమ్మ ఎక్కువగా పగలు నిద్రపోతుంటుంది. నాకయితే రోజూ నాన్నలు, అమ్మ దగ్గరకు ఎక్కువగా రావాలనిపిస్తుంది. అలా వస్తే అమ్మనాకు రోజూ సినిమాకెళ్ళమని, నాకిష్టమైనవాటిని కొనుక్కోమని డబ్బులు ఇస్తుంది.

"ఏరా! నీళ్ళు పోసుకోవడం అయిపోయిందా?" అమ్మ పెద్దగా కేకపెట్టింది.

"ఆ... అయిపోయింది" లాగు విడిచి గుడిసెలోకి వెళ్ళాను. కాసేపటికి ప్రైవేట్‌కు బయలుదేరి వెళ్తూ, వెళ్తూ "అమ్మా! కొనుక్కుంటానికి డబ్బులివ్వవా?" అడిగాను.

"నా దగ్గర పైసా కూడా లేదురా. నాన్నలింకా ఎవరూ రాలేదు. ప్రైవేట్ నుండి వచ్చిన తరువాత ఇస్తాలే" అమ్మ అంది.

"నే వెళ్తున్నా" ప్రైవేట్‌కు బయలుదేరాను.

ప్రైవేట్ నుండి తిరిగి వచ్చాను. అమ్మ నాకు అన్నం పెడుతుంది. అంతలో కారు మా గుడిసె ముందుకు వచ్చి ఆగింది. అమ్మ బయటకు వెళ్ళింది. నేనూ అమ్మతో పాటు ఎంగిలి చెయ్యితోనే వెళ్ళాను.

"ఈ నైట్‌కు వస్తావా?" కారు డ్రైవర్ అడిగాడు.

"ఐదు వందలిస్తా. ఏ విషయం ఇప్పుడే చెప్పు" కారులో నుండి తాతయ్య వయస్సున్న అతడు అడిగాడు. అమ్మ వెనక్కు తిరిగి, నన్ను చూసి "బాబూ! నేను ఈ రాత్రికి ఆ నాన్న వెంట వెళ్ళాలి. నువ్వు అన్నం కడుపునిండా తిని, నిద్రపో" అన్నది.

నాకు ఎంతో ఏడుపొచ్చింది "అదేం కుదరదు. నవ్వు ఇక్కడే ఉండాలమ్మా" ఏడుస్తూ అన్నాను.

"అలా ఏడిస్తే ఎలా? నాన్నలు పిలువగానే వెళ్ళలేదనుకో రేపు మనకు అన్నం ఉండదు. నువ్వు సినిమా కెళ్ళటానికి డబ్బులు ఉండవు. అందుకే ఏడ్వకుండా ఉండు . రేపొద్దునే నేనొస్తాగా" నేను ఏడుస్తున్నా అమ్మ కారు వైపు వెళ్ళింది.

"కమాన్.." అని కారు తలుపు తెరిచిన ముసలినాన్న అమ్మను వేగంగా పైకి లాక్కుని తలుపు వేసాడు. కారు చీకటిలోకి కొంతదూరం వెళ్ళిపోయాక మాయమయింది. నాకు ఎందుకో బాధగా ఉంది. అయినా రేపు అన్నం కావాలంటే, నాకు సినిమాకు డబ్బులు కావాలంటే అమ్మ, నాన్న దగ్గరకు వెళ్ళక తప్పదు.

కారులో వచ్చిన ముసలి నాన్న అప్పుడప్పుడు ఇలాగే వచ్చి అమ్మను తీసుకు వెళ్తాడు. మొన్న ఆగస్టు 15వ తేదీనాడు స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవం జరిగింది. దానికి కొందరు ప్రముఖులు ముఖ్య అతిథులుగా వచ్చారు. వారిలో ఈ ముసలి నాన్నకూడా ఉన్నాడు. అప్పుడు ముసలి నాన్నను పలుకరిద్దామనుకున్నాను. కానీ, అనేకమంది ఆయన చుట్టూ ఉండటం వలన పలుకరించలేకపోయాను. ఆ రోజు సాయంత్రం స్కూల్లో స్వీట్స్ పంచి పెట్టారు. నా క్లాస్‌మేట్ మోహన్ నన్ను వాళ్ళింటికి రమ్మన్నాడు. నేను సరేనని వాడి వెంట బయలు దేరాను. ఇద్దరం వాళ్ళింటికి చేరుకొన్నాము. మోహన్ వాళ్ళది డాబా. మోహన్ అమ్మ నన్ను "మోహన్ ఎలా చదువుతాడు?" అనడిగింది.

"బాగానే చదువుతాడండీ" నేను చెప్పాను. పావుగంట వరకు మోహన్‌కు సంబంధించిన అనేక వివరాలు నన్నడిగి తెలుసుకుంది. ఇంతలో అక్కడికి ఒక వ్యక్తి వచ్చాడు. మోహన్ అమ్మ నన్ను "మీ నాన్న పేరేమిటి? నువ్వెవరబ్బాయివి?" అని అడిగింది.

"మా నాన్న పేరు నాకు తెలియదండీ. అమ్మ, నేను ఇద్దరమే టౌన్ చివర ఉన్న గుడిసెల్లో ఉంటాం" అని అక్కడికొచ్చిన వ్యక్తివైపు చూసాడు. ఆయనని నేను ఎక్కడో చూసినట్టు గుర్తు వచ్చింది. మోహన్ అమ్మతో! "ఈయన కూడా ఒకసారి మా అమ్మదగ్గరకు వచ్చాడు. ఈయన నాకూనాన్నే అవుతాడు" అన్నాను.



నా మాటలు విని ఆమె నిర్ఘాంతపోయింది. ఆమె, ఆ వ్యక్తిని వేరేగదిలోకి తీసుకుపోయి, కాసేపటికి కోపంగా వచ్చి 'వెధవ లంజకొడకా! మా ఆయన నీకు నాన్నవుతాడా? ఎవరు చెప్పార్రా? నీకు ఈ టౌన్‌లో ఉన్న ప్రతి మగాడు నాన్నేరా. మా అబ్బాయితో స్నేహం చెయ్యకు. ముందు ఇక్కడ నుంచి వెళ్ళిపో' గర్జించింది.

ఆమె అన్నమాటలకు నాకు బాధ కలిగింది. గుడిసెకు వెళ్ళినాక అమ్మతో జరిగినదంతా వివరించి చెప్పాను.

"అది కాదురా బాబూ! నువ్వలా మి స్నేహితుల ఇళ్ళకు వెళ్ళకూడదు. ఇక్కడికి వచ్చిన నాన్నలు నీకెక్కడయినా కనిపిస్తే వారిని నువ్వేమీ అనుకూడదు వారితో మాట్లాడకూడదు" చెప్పింది అమ్మ.

మరుసటి రోజు నుండి క్లాస్‌లో మోహన్ నాతో పలకటంలేదు. వాడు ఇంకా నా ఫ్రెండ్స్‌కు కూడా ఏదో చెప్పాడు. వాళ్ళూ నాతో మాట్లాడటంలేదు. వాళ్ళంతా నావైపు వింతగా, హేళనగా చూస్తున్నట్టుంది.

"ఓయ్! ఐదు, పది కొత్త పిట్టలు వచ్చాయి. వస్తావా?" పక్క గుడిసెలో ఉన్న ఆడవాళ్ళు కేకలేస్తున్నారు.

నేను అన్నంతిని బయటకు వచ్చి కూర్చున్నాను. ఎవరో కుర్రాడు పక్క గుడిసెలోని ఒకామె దగ్గరకు వెళ్ళాడు. కొద్దిసేపు బయట మాట్లాడుకుని వారిద్దరు గుడిసెలోకి వెళ్ళిపోయారు. పావుగంట గడిచిన తరువాత ఆ కుర్రాడు నీరసంగా బట్టలు సరి చేసుకుంటూ వెళ్ళిపోయా

143

డు. ఆమె జుట్టు సర్దుకుంటూ, బట్టలు కట్టుకుంటూ బయటకు వచ్చింది. ఆమె లోపలికి పోయినపుడు బాగుంది, గుడిసెల చుట్టూ చిక్కని చీకటి ఆవరించుకుని ఉంది. టౌన్‌లో ఉన్న విద్యుత్ దీపాలు నక్షత్రాల్లా కన్పిస్తున్నాయి.

"బాబూ.. లేరా" అమ్మ పిలుపు విని కళ్ళు తెరిచి చూసాను. సూర్యుడు ఉదయిస్తున్నాడు. అమ్మ కళ్ళు ఎర్ర జీరలతో



మంచాల శ్రీనివాస రావు

నిండి ఉన్నాయి. నీరసంగా కనిపించింది అమ్మ.

"ఏమిటమ్మా అలా అయిపోయావ్"

"రాత్రి నాన్నలదగ్గరకు వెళ్ళానుగా అందుకేరా" మంచాన్ని ఎత్తుతూ, సహజంగానో, బాధగానో చెప్పింది.

అమ్మ హెచ్చరికగా "స్కూల్‌కు టైమ్ అవుతుంది. నువ్వు త్వరగా తయారవ్వు" అన్నది. నేను పళ్ళపొడితో పళ్ళు తోముకోసాగాను. అమ్మ, నన్నెప్పుడు బాగా చదువుకోమంటుంది. ఎప్పుడయి నా స్కూల్‌కు వెళ్ళనంటే నా మీద మండిపడుతుంది. యూనిఫారంతో స్కూల్‌కు వెళుతున్న నన్ను చూస్తే అమ్మకళ్ళలో ఏదో కాంతి ప్రవేశిస్తుంది. నన్ను కళ్ళారా చూసుకొని ఏదో అతీతమైన ఆనందాన్ని పొందుతుందనుకుంటాను. మా స్కూల్‌లో పోయిన సంవత్సరం వేసవి శెలవులు ఇచ్చారు. నా ఫ్రెండ్సంతా వాళ్ళ తాతయ్యల, చుట్టాల ఇళ్ళకు పోయారని స్కూల్ తెరచిన తరువాత చెప్పారు. నన్ను అడిగారు "నువ్వెక్కడికయినా వెళ్ళావా" అని.

"లేదు" నేను చెప్పాను. అదే రోజు అమ్మను అడిగాను "మనకు తాతయ్య, మామయ్య, చుట్టాలు ఎవరు లేరామ్మ"

"ఉన్నారురా. అయినా మనల్ని వారెవరూ చూడరు" అమ్మ అన్నది. నాకు ఏమీ తెలియలేదు అయినా తెలిసినట్టే ఊరుకున్నాను.

oo ooo oo

నేనిప్పుడు ఆరవ తరగతి చదువుతున్నాను. మూడు సంవత్సరాల కాలం గడిచిపోయింది. సాయంత్రం స్కూల్ వదిలిపెట్టగానే, నేను మా గుడిసెకు వెళ్ళేసరికి అమ్మ గుడిసెముందు కూర్చుని ఉంది. అమ్మ ఇదివరకు ఉన్నంత అందంగా లేదు. నీరసంగా, కళావిహీనంగా ఉంది. నేను పుస్తకాలు గుడిసెలో పెట్టి స్నానం చేసి వచ్చి దీపం ముందు పుస్తకం పట్టుకుని చదువుకోసాగాను. రాత్రి అయింది. అమ్మ "ఓయ్... వస్తావా?" కేక వేయసాగింది.

"పోవే నీ దగ్గరకు ఎవరొస్తారు" దారిన పోయే నాన్నలు అంటున్నారు.

నాకా మాటలు వినిపించగానే తెలియని కోపం వచ్చింది. అమ్మ నాన్నలందరినీ రమ్మంటూనే ఉంది. కానీ, ఎవరూ రావటంలేదు. అలా నాన్నలకోసం ఎదురు చూస్తూనే నిద్రపోసాగింది. నేను "స్వాతంత్ర్య దినోత్సవం" పాఠం చదువుతున్నాను. దానిలో మన దేశానికి 'స్వాతంత్ర్యం' వచ్చిందని ఉంది. స్వాతంత్ర్యం అంటే ఏమిటో? గాంధీ తాత స్వాతంత్ర్యానికి ఎక్కువ కృషి చేసాడంట. నేనూ పెద్దయిన తరువాత గాంధీ తాతకంటే బాగా మన దేశానికి 'స్వాతంత్ర్యం' తేవాలనుకున్నాను.

"అమ్మా... అమ్మా... లే..." అన్నాను అమ్మను లేపుతూ.. అమ్మ ఉలిక్కిపడి లేచింది. నన్ను చూసి ఆశ్చర్యంగా "ఇంకా నిద్రపోలేదురా బాబూ!" అంది.

"లేదమ్మా!" సమాధానమిచ్చాను.

"నిద్రపోరా" అని నన్ను తన ఒడిలోకి తీసుకొని వీపుపై చేతితో చిన్నగా జోకొట్టసాగింది. నాకు మా కుక్కిమంచంకంటే అమ్మ ఒడి బావుంది. ఇదివరకెప్పుడూ అమ్మ, నన్నిలా లాలించలేదు.

oo ooo oo

ఆరవ తరగతి నుండి నేను ఏడవ తరగతిలోకి వెళ్ళాను. ఈ మధ్య గుడిసెలోకి నాన్నలెవరూ రావటంలేదు. అమ్మ రోజు రోజుకు సన్నబడుతూ, కాంతివిహీనంగా ఉన్నట్టుంది. అమ్మ ఇప్పుడు కుక్కిమంచంలో నుండి లేవటంలేదు. మా గుడిసె పక్క ఆమె రోజూ వచ్చి వంట చేసి పోతుంది.

ఒకరోజు ఆమెను అడిగాను. "అమ్మకు ఏమయింది?"

ఆమె "బాబూ! మీ అమ్మకు కొన్ని చెడు రోగాలు వచ్చాయి. అందువలనే ఇలా ఉంది" అన్నది.

"రోగాలు పోవాలంటే ఏం చెయ్యాలి"

"డాక్టర్ గారి దగ్గరకు వెళ్ళాలి"

"వెళ్తాను"

"వెళ్తావు కానీ డబ్బులుంటేనే ఆయన మీ అమ్మరోగం నయం చేస్తాడు" చెప్పి వెళ్ళిపోయిందామె. నాకు దుఃఖం పొంగుకువచ్చింది. అమ్మ దగ్గరకు వెళ్ళి ఏడుస్తూ "నాకు డబ్బులివ్వమ్మా.పోయి డాక్టర్‌ను పిలుచుకువస్తాను" అన్నాను.

అమ్మనేను చెప్పేది వినకుండా "ఇవాళ స్కూల్‌కు వెళ్ళలేదేమిట్రా?" ప్రశ్నించింది.

"నీకు ఆరోగ్యం బాగోలేదుగా అందుకుని"

"నేను నిన్నెందుకు చదివిస్తున్నానో తెలుసా?"

తెలియదన్నట్టు తల ఊపాను. "నువ్వు బాగా చదువుకొని, పెద్దయిన తరువాత డాక్టర్‌వి కావాలి. అప్పుడు నాలాంటి వాళ్ళకు వచ్చిన రోగాలను నయం చేయాలి. అందుకేరా నిన్ను చదివిస్తుంది" వినపడీ వినపడనట్టు అంది. నేను సరేనన్నట్టు తల ఆడించాను.

oo ooo oo

కొన్ని నెలలనుండి అమ్మకు, నాకు సరిగా తింటానికి తిండిలేదు. అప్పుడప్పుడు నేనూ పస్తులుండాల్సి వస్తుంది. నేను సినిమాకు అసలు వెళ్ళటంలేదు. స్కూల్ నుండి వస్తుంటే ఎన్నో తినుబండారాలు కనిపిస్తూ ఉంటాయి. వాటిని తినాలంటే నా వద్ద డబ్బులేదు. స్కూల్ ఫీజు ఇంకా చెల్లించలేదు. ఫీజు చెల్లించకపోతే స్కూల్‌కు రానివ్వరని అన్నారు. అమ్మదగ్గర డబ్బులు ఏమీలేవు.

మా పక్క గుడిసె ఆమె, ఇంకొక ఆమెతో రాత్రిపూట చెబుతుంది "సుశీల ఇక బతకకపోవచ్చు"

"ఎలా?"

"దానికి రోగాలు వచ్చాయి. నేనంతకు ముందు చెబుతూనే ఉన్నాను. ఏమే సుశీల! మందులు వాడుతూ, జాగ్రత్తగా ఉండమని. అది నా మాట వినకుండా ప్రతిక్షణం మగాళ్ళతో గడిపింది. ఇప్పుడు అనుభవిస్తుంది"

"అది మూలన పడబట్టికానీ, లేకుంటే మన దగ్గరకు ఏ మగాడయినా వస్తాడా?"

"అదిక బతకటం కష్టం. దాదాపు చనిపోయినట్టే" పక్క గుడిసె ఆమె అంది.

ఆ మాట వినటంతోనే నాకు భయమేసింది. చచ్చిపోవటం అంటే ఏమిటో నాకు తెలియకపోయినా, చచ్చిపోయిన వాళ్ళు మనకిక కనబడరని నాకు తెలుసు. "అమ్మ చచ్చిపోకూడదు. నేను డాక్టర్ అయ్యే వరకు అమ్మ బతికే ఉండాలి. నేను డాక్టర్‌ని అయిన తరువాత అమ్మరోగాలు నయం చేస్తాను" మనసులో అనుకున్నాను. నాకు ఆకలిగా ఉంది. అమ్మ దగ్గరకు పోయి "ఆకలేస్తుంది. అన్నం పెట్టమ్మా" అడిగాను.

"డబ్బులు లేవురా"

"ఎందుకని?"

"నాన్నలు రావటంలేదురా బాబూ!"

అమ్మతో నేనిక మాట్లాడకుండా గుడిసెముందుకు వచ్చి కూర్చున్నాను. టౌనంతా విద్యుద్దీపాల కాంతితో నిండిపోయింది. మా గుడిసెల మధ్య చీకటి ఆవరించుకుని ఉంది. నాలో ఎన్నో ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఆకలి తీరాలంటే డబ్బుకావాలి. డబ్బుకావాలంటే 'నాన్నలు' అమ్మ దగ్గరకు రావాలి. ఆకలి కడుపులోని పేగుల్ని మెలిపెడుతుంది.నేనిక రేపట్నుండి స్కూల్‌కి వెళ్ళటంమానివేసి, ఏదైనా హోటల్‌లో పనిచేస్తూ అమ్మను బతికించుకోవాలి. కానీ, నాకు బాధగా ఉంది. ఎందుకంటే నేను స్కూల్ మానివేస్తున్నానని కాదు. అమ్మకోరినట్టు డాక్టర్‌ని కాలేకపోతున్నానని. నా ముందు ఒకే ఒక ప్రశ్న జవాబులేని దానిలా నుంచొని ఉంది. ఇప్పుడు అమ్మదగ్గరకు, ఇదివరకు వచ్చినట్టు "నాన్నలెందుకురావట్లేదు" అని. మీరైనా జవాబు చెప్పరూ... ?...!